కుక్కబ్రతుకు

ఉదయం పది గంటలు దాటింది. బజారులో దుకాణాలన్నీ ఒక్కొక్కటీ తెరుస్తు న్నారు.

బూల్‌చంద్ బట్టల దుకాణం అప్పుడే తెరవబడింది. పని కుర్రాళ్ళు షాపుతుడిచి, బీరువాలు, బల్లలు దుమ్ముదులుపుతున్నారు. సేట్ బూల్‌చంద్ వచ్చి దేముళ్ళ పటాలకి కేష్ బాక్సకి నమస్కారం చేసి కేష్‌బాక్స్ ముందు కూర్చున్నాడు. బూల్‌చంద్ పెద్ద కొడుకు కిషన్ ఎకౌంటు పుస్తకాలు ముందేసుకున్నాడు. చిన్నకొడుకు రామచంద్ షో కేసుల్లో ఆడబొమ్మలకి అందంగా క్రొత్త చీర కడ్తున్నాడు.

ఇంతలో పూజారి వచ్చాడు. షాపులో వున్న దేముడి పటాలకి పూలదండలువేసి, అగరువత్తులు వెలిగించి పూజచేసి కర్పూరం వెలిగించి హారతిచ్చి, బూల్‌చంద్ దగ్గిరికి తీసుకెళ్ళాడు. సేట్ భక్తిగా హారతి కళ్ళకద్దుకున్నాడు. ఇనెప్పెట్టకి హారతిచ్చాడు. కొడుకులిద్దరూ కూడా వచ్చి భక్తిగా హారతి తీసుకున్నారు. రోజూలా పూజ తంతు ముగిసిందే తడువు అన్నట్టు వరసపెట్టి ముష్టివాళ్ళు రావడం ఆరంభించారు. రామ్‌చంద్ తండ్రి దగ్గర ఉన్న ఓ గ్లాసులోంచి చిల్లర డబ్బులు తలో ఐదుపైసలు వచ్చిన వాళ్ళందరికీ వేస్తున్నాడు. "ధర్మరాజులు, మహాప్రభువులు, పదికాలాల పాటు చల్లగా వుండాలి" అంటూ ముష్టివాళ్ళు దీవించి వెడుతున్నారు.

ఒక్కొక్కళ్ళు కస్టమర్స్ రావడం ఆరంభించారు. చీరలు, బట్టలు తీస్తున్నారు, చూపిస్తున్నారు, కత్తిరిస్తున్నారు, బిల్లులేస్తున్నారు. కేష్ బాక్స్‌లోకి వెడుతూంది. పదకొండు అయ్యేసరికి బేరం జోరుగా అందుకుంది.

అదే సమయంలోనే ఓ భార్యాభర్తలు దుకాణంలోకి వచ్చారు. చీరలు తీయించారు.

ఆమె ఇవి కావు అవి అంది. అవి కావు ఇవి అంది. దీని రంగు బాగులేదు. దానికి జరీ నచ్చలేదు. ఈ చీర వెడల్పు లేదు అంటూ మొత్తం షాపునంతా తిరగతోడించింది. ఏది బాగులేదని చప్పరించింది. ఆమెకి చీరలు చూపిస్తున్న పని కుర్రాడు రంగడికి విసుగుతోపాటు కాస్త కోపం వచ్చింది. ఆమె ముందున్న చీరల దొంతర్లవి, కుప్పకుప్పలుగా పడివున్న అన్నింటిని చూసి అవన్నీ సరిగా సర్దడానికే వక గంట పడ్తుందన్న విసుగుతో "ఏమిటమ్మగారు, ఇన్ని చీరలు తీయించారు. ఏది నచ్చ లేదంటారు" అన్నాడు అసహనంగా.

కాస్త దూరంగా ఎవరికో సూటుగుడ్డలు, టెర్లిన్లు చూపిస్తున్న కిషన్ రంగడి మాటలు విని "ఏం కావాలంటారు వారు" అంటూ ఆ బేరం తమ్ముడి కప్పగించి చీరలువైపు నడిచాడు. "ఏమిటి మేడమ్, ఏం కావాలి బెనారస్, కంజీవరం, ధర్మవరం, మైసూర్ సిల్క్, జపాన్ సిల్కు, షిఫాన్, నైలాన్‌జార్జట్, క్రేప్, కాలిసింథ్..... అన్నీ వున్నాయి ఏం కావాలి?" అంటూ ఓ డజను పేర్లు గడ గడ చదివాడు.

"ప్చ్, ఏం బాగులేవు. అన్నీ ఓల్డు పాషన్, పాత స్టాకే... క్రొత్త వెరైటీ ఏం లేదే? వీటిల్లో" అంటూ ఆమె చప్పరించింది.

"ఈ కాలిసింథ్ క్రొత్త డిజైనులు చూడండి. ఈ జపాను సిల్కు బంగీ మొన్ననే విప్పాం. కంజీవరం నించి మొన్ననే తెచ్చాం ఈ చీరలు. ఇవన్నీ ఇప్పటివే పాతవికావు మేడమ్, ఒరేయ్ రంగా నిన్న వచ్చిన బంగీలో షిఫాన్, జార్జెట్ పట్రారా..." అన్నాడు కిషన్. చీరలు సర్రున విప్పి, ఆమె ముందు ఒక్కొక్కటీ పడేస్తూ వాటి గుణ విశేషాలు అప్పచెప్పసాగాడు. కష్టమర్లని అంత సులువుగా వదులుకోవడం అతనికిష్టంలేదు. తండ్రి దగ్గిర వ్యాపార దక్షత, మెళకువలు బాగా నేర్చుకున్న కిషన్ కష్టమర్లని ఎలా ఆకట్టుకోవాలో, వాళ్ళు షాపంతా తిరగతోడించినా విసుక్కోకుండా వుండే అలవాటు, వగైరా వ్యాపార కిటుకులన్నీ బాగా తెలుసుకున్నాడు. ఆమె కళ్ళముందు చీరలు కుప్పలు కుప్పలు పడుతున్నాయి. అన్నింటిని చూసి మొహం తిప్పేస్తున్న ఆమెని చూసి ఆఖరికి ఆమె భర్తకే విసుగొచ్చింది.

"చూడు రమా, ఏదీ నచ్చలేదంటే ఎలా, ఇన్ని చీరలు చూపించారు, ఒక్కటేనా నచ్చలేదా" అన్నాడు అసహనంగా.

"బావుందండీ, నాకైతే ఎలాంటివన్నా కొందును. మరొకళ్ళకి కొంటున్నప్పుడు వాళ్లడిగినట్లు కొనద్దూ! అది రాసిన రంగులుంటే బార్డరు సరిగాలేదు. జరీ బావుందంటే రంగు సరిపోలేదు. నన్నేం చెయ్యమంటారు?"

"బావుంది, మీ చెల్లెలు మాట దేముడెరుగు నీకే నచ్చటంలేదు, అబ్బబ్బ, అందుకే ఆడవాళ్ళతో అసలు షాపింగుకి రాకూడదు. మీ చెల్లెలి పెళ్ళికాదు కాని ముందు నీ వెంట షాపులకి తిరగలేక నా ప్రాణాలు పోతున్నాయి. పన్నెండు గంటలవుతూంది. ఏదన్నా కొనే మాటయితే కొను. లేకపోతే పద" అన్నాడు విసుగ్గా.

"ఉండండి, ఉండండి ఏవో క్రొత్త చీరలు పట్టుకొస్తున్నాడు" అంది రమ. క్రొత్తగా వచ్చిన చీరలు దొంతర్లు పేర్చారు. పైకి కిందకి లాగి, ప్రక్కకి తోసి, ఇదివరకటివే బావున్నట్టున్నాయి అంటూ మళ్ళీ వాటిల్లోంచి పైకిలాగి క్రొత్తవి పాతవి పోల్చిచూస్తూ, ఏది కొనాలో తేల్చుకోలేక, "అదిగో అక్కడ ఆ బీరువాలో ఏదో వున్నట్టుంది. ఆ చీర తీయండి" అంటూ అది లాగించింది. తీరా చూస్తే బీరువాలో ఉన్నంత సేపు అంతంగా కనిపించినది ముందు పడగానే చప్పరించేసింది.

కిషన్‌లో ఓర్పి ఆఖరిమెట్టుకు వచ్చేసింది. రెండు గంటలనించి షాపునంతా కలయతీయించిన ఆమె అన్నిరకాల చీరల్లో ఏది నచ్చలేదంటం అతనికి కోపంతోపాటు, ఎలాగైనా ఆమెచేత ఒక్క చీరైనా కొనిపించకుండా వదలకూడదన్న పంతం పెరుగుతూంది. మరో బీరువా చర్రున లాగి మరికొన్ని చీరలు తీశాడు. చీరలన్నీ విసురుగా విప్పి కుప్పలా పోసేస్తున్నాడు. "అమ్మా... మీరు ఈ ఊరంతా తిరిగినా యింతకంటే మంచి చీరలు ఏ షాపులోనన్నా దొరికితే మా షాపు మూసేస్తాం, వ్యాపారం ఎత్తేస్తాం, ఇన్ని రకాల చీరలు మా షాపులో కాక మరెక్కడమ్మా దొరికేవి. ఎర్రబడ్డ మొహంతో సవాల్ చేశాడు. మూర్తి షాపువాడి చిరాకును గమనించాడు. ఇంకా ఊరుకుంటే మర్యాద పోతుందని "రమా, వాటిల్లో ఏదో ఒకటి తీసుకుని త్వరగా రా! ఇంక చాలు ఎంచడం" అన్నాడు కఠినంగా.

"అయినా ఇంటిదగ్గర ఏం చీరలు కావాలో, ఎంత ఖరీదు కావాలో అన్నీ నిర్ణయించుకోకుండా ఇక్కడికొచ్చి అన్నీ తీయించడం వాళ్ళని బాధ పెట్టడం ఏమిటి? ఏమిటి కొనేమాటయితే కొను లేకపోతే పద వెంటనే.

కిషన్ కాస్త శంకించి "ఫర్వాలేదు సార్! అమ్మగారికి నచ్చితేనే తీసుకోమనండి. మా షాపులోనే నచ్చకపోతే మరెక్కడా నచ్చవు అన్నా అంతే, మా కిది అలవాటే సార్! లేకపోతే వ్యాపారం ఎలా చేస్తాం" అన్నాడు. కుర్రాళ్ళు చీరలు మడతలు పెడ్తున్నారు. అన్నీ తీయించి ఏదో ఒకటి కొనకపోతే బాగుండదని, ముఖ్యంగా భర్త కేకలేస్తాడని తప్పక అసంతృప్తిగానే ఓ చీర తీసింది రమ.

"హమ్మయ్య" అన్నాడు మూర్తి. కిషన్, కుర్రాడు లోపలనుకున్నారు, ఆ మాట.

చీర ప్యాక్ చేయించి, నూరు రూపాయలు బిల్లు చెల్లించి బయటికి నడిచారు ఇద్దరూ.

"భలే బేరం సార్" అన్నాడు రంగడు చీరలు సర్దుతూ. కిషన్ చీరలకుప్ప మధ్యనించి చీరలు తీస్తూ అదోలా నవ్వాడు కళ్లెగరేసి రంగడిని చూసి, రంగడు ఆశ్చర్యంగా చూశాడు, షాపు వెనకాల ఇంట్లో కెడుతున్న కిషన్‌ని.

రమ, మూర్తి వెళ్ళిన మరో పదినిముషాలకి ఆదరా బాదరా చెమటలు కక్కుతూ హడావిడిగా లోపలికి వచ్చారు.

క్యాషుబాక్స్ దగ్గర బూల్‌చంద్, ఎకౌంట్ బుక్ దగ్గిర కిషన్, బట్టలు చూపిస్తున్న కుర్రాళ్ళు అందరూ ప్రశ్నార్థకంగా చూశారు.

"ఏమండీ ఇక్కడ మా పార్శిల్ ఒకటి ఒదిలేశామండీ" మూర్తి హడావిడిగా అన్నాడు.

"ప్యాకెట్టా... ఏం పార్సిల్ సార్" రామచంద్ ప్రశ్నించాడు.

"మరో షాపులో తీసుకున్న మూడు చీరెల ప్యాకెట్ ఇక్కడ వదిలేశామండీ కొంతదూరం వెళ్ళాక గుర్తువచ్చి చూసుకున్నాం. అందుకని వెంటనే వచ్చాం."

"చీరల ప్యాకెట్టా... యిక్కడేం లేదే ..." అన్నాడు రంగడు కిషన్‌ని చూస్తూ.

"ఇక్కడే వదిలామండీ, ఇందాక చీరలు చూస్తున్నప్పుడు చేతిలోది బల్లమీద పెట్టాను. తరువాత చీరెలు చూసే హడావిడిలో మర్చిపోయాను. ఆ చీరల క్రింద ఎక్కడో వుండిపోయి వుంటుంది. అదిగో అక్కడ పెట్టాను" అంటూ చూపింది రమ.

"మీరెళ్ళాక మేం చీరలన్నీ బీరువాల్లో సర్దేశాం. మాకేం కనపడలేదే. మీరెక్కడ మర్చిపోయారో ఏమిటో... " కిషన్ అన్నాడు.

"అయ్యో లేదండీ. ఆషాపులో చీరలు కొని ఇక్కడికి వచ్చాం. ఇట్నించి తిన్నగా ఇంటికే బయలుదేరాం. దారిలో గుర్తువచ్చి చూస్తే లేదని పరిగెత్తి వచ్చాం" రమ ఆదుర్దాగా, గాబరాగా అంది.

"ఉంటే ఏమయిపోతుంది. మా షాపులోనే వదలివుంటే ఇక్కడే వుంటుంది. ఏరా రంగా చీరలు సర్దినప్పుడు నీ కేమన్నా కనిపించిందా?"

"లేదు సార్, ఇక్కడం లేందే" అన్నాడు.

"బాగుందండీ, లేదంటే ఏమయిపోయినట్టు... ఇక్కడ మరిచి వెళ్ళాం – మరో

పది నిమిషాలలో వచ్చాం. లేదంటే సరిపోతుందా?" రమ ఈసారి కాస్త ధాటీగా అంది. ఆ మాటకి కిషన్ మొహం ఎర్రబడింది. బూల్‌చంద్ కాషబాక్స్ మీదగా తలెత్తి చూశాడు. అతని కళ్ళల్లో కాస్త కోపం తొంగిచూసింది.

"మేడమ్, మేము అబద్ధం చెప్తున్నాం అనుకున్నారా? అయితే మా షాపంతా మీరే చూసుకోండి. ఒరేయ్ రంగా అమ్మగారికి ఆ బీరువాలన్నీ చూపు" అన్నాడు పౌరుషంగా రామ్‌చంద్.

మూర్తి కలుగజేసుకుంటూ "అది కాదండీ మా ఉద్దేశం. మీరు తీశారని అండం లేదు మేము. ఇక్కడ మర్చిపోయామని, ఒకవేళ మీరు తీసి దాచి వుంటారని వచ్చాం" సర్ది చెప్పబోయాడు.

"సార్, మేం చూసుంటే భద్రంగా దాచి మీరు రాగానే యిచ్చేవారం కదండీ. ఈ మాత్రం నిజాయితీ లేకపోతే వ్యాపారం ఎలా చేస్తాం సార్, ఇలాంటివి ఇక్కడ జరిగితే మర్నాడు మా షాపుకి కస్టమర్స్ వస్తారా..." కిషన్ అన్నాడు.

"ఏభై ఏళ్ళుగా వ్యాపారం చేస్తున్నాం సార్. ఎవరితో ఇలా అన్పించుకోలేదు. మా పేరు. మా నిజాయితీ మీకు తెలియక పోవచ్చు గానీ ఎవర్నన్నా అడగండి" బూల్‌చంద్ కష్టంగా అన్నాడు. సాధారణంగా యింతంత పెద్దషాపు వర్తకులు ధరలలో బిగిస్తారు, మోసం చేస్తారుగాని సరుకులో, కొలతలు, తూకాలు వగైరాలలో మోసం చేయరని కస్టమర్స్ పట్ల నిజాయితీలో లోపం వుండదని మూర్తికి తెలుసు. ఇలాంటి పనులు చేసి బయటపడితే వాళ్ళ బిజినెస్ దెబ్బ తింటుందన్న భయం వాళ్ళకి వుంటుంది. కనుక వాళ్ళిప్పుడు అబద్ధం చెపుతున్నారని మూర్తికి అన్పించలేదు. కాన రమ అన్నట్టు వాళ్ళు కాకపోతే ఆ పనిచేసే కుర్రాళ్ళు ఎవరన్నా వుండచ్చు. చూస్తూ చూస్తూ ఆరొందల రూపాయలు తాము మాత్రం వదులుకోలేరు గదా!

"మీరు మరోలా అనుకోకండి. మా ఆదుర్దా మాదిగదా. ఇక్కడ మరిచిపోయి వుంటామన్న అనుమానంతో."

"అనుమానం ఏమిటండీ, స్పష్టంగా నాకు గుర్తుంది. పోనీ యిక్కడనించి మరెక్కడికన్నా వెళ్ళాం గనుకనా... వాళ్ళు తీసుండకపోవచ్చు, పనివాళ్ళు తీసుండచ్చుగదా, మీ పనివాళ్ళని అడగండి, కాస్త వెతికించండి –" రమ కాస్త ధాటిగానే అంది. బూల్‌చంద్ మొహం ఎర్రబడింది. "కిషన్ షాపంతా చూపించు" అన్నాడు గంభీరంగా.

కిషన్ విసురుగా అరలలోని చీరలన్నీ లాగిపడేస్తూ "చూసుకోండి, చూసుకోండి...

మా పనివాళ్ళు షాపువదలి వెళ్ళనేలేదు, వాళ్ళెలా దాచివుంటారు. ఉంటే యిక్కడే వుంటుంది. చూసుకోండి" అన్నాడు. రమ చీరలు క్రిందా పైనా తీసి వెతికింది. "మన పిచ్చిగాకపోతే తీసిన వాళ్ళు ఎదురుగా పెడతారా ఏమిటి" అంది.

మూర్తి ఎటూ చెప్పలేని స్థితిలో పడ్డాడు. వాళ్ళమీద దొంగతనం మోపలేడు, అలా అని చూస్తూ చూస్తూ అంత సొమ్ము వదలలేని ఆ నిస్సహాయతలో భర్తమీద కోపం ముంచుకు వచ్చింది. "పద ఇంక యింటికి, చేశావు నిర్వాకం. అయినా అంత వళ్ళు తెలియకుండా వదిలేయడం – పోయిన వస్తువు దొరకడం ఉత్తమాట."

"బాగుందండీ... ఒకటా రెండా పోనీలే అని ఊరుకోడానికి ... ఆరువందలు. అందులో మనవి కావు. ఇప్పుడే వాళ్ళకి మనం ఒట్టం యిచ్చుకోవాలి... అంత సులువుగా వదిలేస్తామా, పోలీసులకి రిపోర్టు యీయండి. వాళ్ళే తేలుస్తారు వ్యవహారం."

కిషన్ మొహం ఎర్రబడింది. యువరక్తంగదా ఆవేశ పడిపోతూ "మేడమ్, యిందాకటి నించి చూస్తున్నాం, మేం దొంగలం అంటున్నారు, పోలీసులంటే భయపడి పోతామనుకుంటున్నారా?" దూకుడుగా అన్నాడు.

"కిషన్" బూల్‌చంద్ కొడుకుని వారిస్తున్నట్టు హెచ్చరికగా పిలిచాడు. "సార్ పోలీసులని పిలవండి, వాళ్ళే చూస్తారు... పని కుర్రాళ్ల ఎవరన్నా తీసివుంటే అది మా తప్పుకాదు... పోలీసులు... అల్లరి మా షాపుకి చెడ్డపేరు తెస్తుంది అనుకోండి, అయినా మీరు అనుమానిస్తున్నారు గనుక పిలవండి... అదిగో ఫోను" అన్నాడు గంభీరంగా.

వాళ్ళంత ఖచ్చితంగా మాట్లాడుతూంటే రమలో వాళ్ళు తీయలేదేమో ననిపించింది. కాని మరెలా పోయినట్టు? ఆ పని కుర్రాడిమీదే రమ అనుమానం అంతా వుంది. చీరలు సర్దుకున్నప్పుడు వాడే చూసి ఎక్కడో దాచేసి వుంటాడు తరువాత పట్టుకుపోవడానికి అని నిశ్చయించుకుంది. అందుకే పోలీసు రిపోర్టు ఇస్తే వాళ్ళే నిజం లాగుతారు అనుకుంది, మూర్తి చూస్తూ ఆరేడువందలు వదలలేక రిపోర్టు ఇస్తే పోయేదేం వుంది, అదృష్టం బాగుంటే దొరకవచ్చు ననిపించి ఫోను చేశాడు.

షాపులో బూల్‌చంద్ మొహం గంభీరంగా పెట్టుకుని కూర్చున్నాడు. కిషన్ మొహం గంటుపెట్టుకుని కోపంగా చూస్తున్నాడు. పని కుర్రాళ్ళు భయం భయంగా చూస్తూ నిల్చున్నారు. కొనడానికి వచ్చిన ఒకరిద్దరికి అన్యమనస్కంగానే గుడ్డలు చూపిస్తున్నాడు రామ్‌చంద్.

అరగంటలో పోలీసులు వచ్చారు. ప్రశ్నలు జవాబులు, ఆరాలు అన్నీ చేశారు. మూర్తి తన అనుమానం చెప్పాడు. బూల్‌చంద్ తమ నిర్దోషిత్వం చెప్పి కావలిస్తే షాపు సోదా చేసుకోమన్నాడు. షాపు షాపంతా పోలీసులు గాలించారు. “దొంగ సొమ్ము మీకు కనపడేట్టు పెడ్తారా... అదిగో ఆ కుర్రాడే మాకు బట్టలు చూపించాడు. తీస్తే వాడే తీసి వుండాలి మరోలా పోవడానికి ఆస్కారం లేదు, వాడ్నే గట్టిగా అడగండి” అంది రమ.

పోలీసులు రకరకాలుగా రంగడిని ప్రశ్నించారు. దబాయించారు. బెదిరించారు. జైలుకి పద అని బయపెట్టారు. ఏం చేసినా “లేదు, తెలియదు, నేను చూడలేదు” అన్నపాటే పాడుతున్న రంగడిని చూసి పోలీసు కానిస్టేబుల్‌కి వళ్ళు మండింది.

“నీవిలా ఎందుకు చెప్తావురా దొంగ రాస్కెల్, నీచేత నిజం ఎలా పలికించాలో మాకు తెలుసురా” అంటూ లాఠీతో కొట్టడం ఆరంభించాడు. “చెప్పరా నిజం చెప్పు... ఎక్కడ దాచావో చెప్పు... లేకపోతే ఎముకలు విరుగుతాయి. రక్తం కక్కిస్తా... నిజం లాగడం మాకు తెలుసురా...” అంటూ అందినచోటల్లా లాఠీతో కుళ్ళ బొడవడం రంభించాడు. ఫెడీ ఫెడీ మని లాఠీ చప్పుడవుతూంది. మొదటి రెండు మూడు దెబ్బలని పౌరుషంగా తట్టుకున్నాడు. రంగడు, తరువాత మరో రెండు మూడు దెబ్బలని పెదాలు బిగపట్టి బాధ అణుచుకుని భరించాడు. అంతసేపు “నాకు తెలీదు, నే తీయలేదు” అంటూ దెబ్బలు తప్పించుకుంటూ అరుస్తూనే వున్నాడు. వాడు మొండికెత్తి అదే జవాబు యివ్వడం, దెబ్బలని లక్ష్యపెట్టక పోవడం చూసి పోలీసు మరింత పంతంగా కోపంగా కొట్టడం ఆరంభించాడు. దాంతో రంగడు దెబ్బలకి బాబోయ్... నిజంగా నేను తీయలేదు బాబోయ్...” అంటూ దెబ్బల నించి తప్పించుకుంటూ గగ్గోలు పెట్టసాగాడు... వాడి ముక్కునించి నెత్తురు కారడం ఆరంభించింది. దెబ్బలు తగిలినచోటల్లా నల్లగా కమిలి పోయింది చర్మం.

కిషన్ ఆవేశంతో వణికిపోతూ పళ్ళు బిగించాడు. బూల్‌చంద్ చూడలేనట్లు ఎర్రబడ్డ మొహం త్రిప్పుకున్నాడు. తక్కిన పనివాళ్ళు బిక్కచచ్చిపోయారు. ఆషాపులో కొనడానికి వచ్చినవాళ్ళు, చుట్టు ప్రక్కల షాపులవాళ్ళు గుమ్మంలో గుమిగూడి భయంగా చూస్తూ “అబ్బబ్బ...” అని నిట్టూర్చసాగారు.

అంతవరకు తెల్లబోయి చూస్తున్న మూర్తి తెప్పరిల్లి... “ఆగండి.... ఆగండి అలా కొట్టకండి.. కట్టద్దు... కావలిస్తే జైలుకి తీసుకెళ్ళండిగాని అలా కొట్తారేమిటి” అన్నాడు ఆ గోల చూడలేక.

"ఆ... మీరూరుకోండి సార్... యిలాంటి అణాకాని దొంగ వెధవలందరిని జైళ్ళల్లో పెట్టాలంటే మరిన్ని జైళ్ళు కావాలి. ... నాలుగు దెబ్బలకి నిజం పైకొస్తుంది. ఆపాటి దానికి జైలు ఎందుకు?" అంటూ మళ్ళీ కొట్టడం ఆరంభించాడు.

రంగడలా చావుదెబ్బలుతింటూ అరుస్తూంటే చుట్టు అందరు రమ మూర్తిలని వీళ్ళే కారకులన్నట్టు చూస్తుంటే గిల్టీగా ఫీలవుతూ తలవంచుకుంది రమ. ఆమె కూడ ఆ కొట్టడం భరించలేకపోయింది. రెండు నిమిషాలు చూసి మరి భరించలేక "ఆగండి, అబ్బబ్బ యిదేమిటి, మీకు రిపోర్టిచ్చింది యిలా కొట్టడానికా... కావలిస్తే పోలీసు స్టేషనుకు తీసుకుపోయి కొట్టుకోండి కాని మా కళ్ళముందు యిలా కొట్టకండి... అబ్బబ్బ చూడలేం... పోయినవి ఎలాగో పోయాయి, ఈ పాపం కూడా మా కెందుకు" రమ అంది. మూర్తి భార్యవంక నీవే కారకురాలివన్నట్టు చూశాడు.

ఇంచుమించు స్పృహలేనట్లు చలనరహితంగా పడుండిపోయాడు రంగడు.

బూల్‌చంద్ ఉద్రేకంగా "ఆగండి సార్, వాడ్ని విడవండి. ఇంక చంపకండి వాడ్ని ఎంతయినా మా క్రింద సంవత్సరం నించి పనిచేస్తున్నాడు. మేమూ మనుష్యులం సార్... మా కళ్ళ ఎదురుగా వాడ్ని అలా కొట్టకండి... మా షాపులో దొంగతనం జరిగిందంటున్నారు. సరే మీకు కావల్సింది డబ్బేగా.. తీసుకోండి. ఈ ఆరొందలతో మేము మేడలు కట్టం సార్! న్యాయం అన్యాయం చూడటానికి ఆ దేముడే వున్నాడు. తీసుకోండి సార్, తీసుకుని మమ్మల్నింక వదలి వెళ్ళండి" ఆవేశంగా అంటూ నోట్లు తీశాడు బూల్‌చంద్."

కిషన్ ఏమనాలో తెలియక తిరస్కారంగా చూశాడు. మూర్తికి బూల్‌చంద్ మాటలకి తలకొట్టేసినట్లయింది. తాము అబద్ధం ఆడుతున్నట్టు, ఏదో దానధర్మం క్రింద బిచ్చగాడికి విదిల్చినట్లు డబ్బు విసరడం అవమానమనిపించింది. "మేం అడిగింది పోయిన మా చీరలుకానీ, మీరు దయతల్చి పారేసే డబ్బు కాదు వుంచండి. పద రమా. జరిగిన ఈ గొడవలింక చాలు. పోయిన వస్తువు దొరకడం ఎక్కడన్నా వుందా. పదపద యింక" అన్నాడు తీక్షణంగా. రమ చూస్తూ చూస్తూ అంత డబ్బుని వదలలేక అలా అని ఆ రంగడిని పోలీసులు కొడుతూంటే చూడలేక, ఏం చెయ్యాలో తెలియక యింకా ఏమన్నా అంటే భర్త ఊరుకోడన్న భయంతో అయిష్టంగానే కదిలింది.

"సార్, వీడ్ని ఏం చెయ్యమంటారు సార్, కేసు విత్‌డ్రా చేసుకున్నారా?" అన్నాడు పోలీసు. "మీ యిష్టం, లాకప్‌లో పెడితే పెట్టండి కాని అలా కొట్టద్దు. ఏదన్నా

ఆచూకీ దొరికితే ఇదిగో మా అడ్రస్, కబురు చెప్పండి" అన్నాడు మూర్తి మెట్లు దిగుతూ.

మూర్తి అలా వెళ్ళగానే కానిస్టేబుల్ క్రిందపడివున్న రంగడిని లాఠీతోకొట్టి "బ్రతికిపోయావు - పోరా పో - ఇంక ఇలాంటి కేసులని లాకప్‌లో పెట్టడం ఆరంభిస్తే మా పని అయినట్టే" అంటూ వెళ్లిపోయాడు. చుట్టూ మూగిన అందరూ చోద్యం అయిపోయినట్టు వెళ్ళారు.

షాపులో మిగతా కుర్రాళ్ళు రంగడిని లేవదీసి కూర్చోపెట్టి నీళ్ళుపట్టారు. తడిగుడ్డతో ముక్కంట కారుతున్న నెత్తురు తుడిచి గాయాల్ని తడిగుడ్డతో తుడిచారు. కిషన్ టీ తెప్పించి తాగించాడు. రంగడు కాస్త తేరుకున్నాడు. బూల్‌చంద్ రామచంద్ భోజనానికి లోపలికెళ్ళారు. పని కుర్రాళ్ళు వెళ్ళారు. ఓరిక్షా తెప్పించి ఆస్పత్రికి వెళ్ళి మందేయించుకుని ఈ పూటకి విశ్రాంతి తీసుకో అని చెప్పి వెళ్ళాడు బూల్‌చంద్ సానుభూతిగా.

రిక్షా వచ్చింది. రంగడి కెళ్ళేముందు కిషన్ ఓదార్పుగా వాడి భుజం తట్టాడు. జేబులోంచి ఓ ఇరవై రూపాయలు తీసి వాడి జేబులో పెట్టాడు. రంగడి కళ్ళనిండా సంతోషం, కృతజ్ఞత "ఫరవాలేదు సార్" అన్నాడు.

రిక్షా కదిలివెడుతుంటే వీధి గుమ్మంలో నిలబడి చూస్తున్నాడు కిషన్. షాపుకి ఎదురుగా కొద్దిదూరంలో ఉన్న ఓ చెట్టు నీడని ఓ ముష్టివాడు అడుక్కు తెచ్చుకున్న అన్నం తింటున్నాడు. ఓ గజ్జికుక్క ఆ ముష్టివాడి దగ్గిర ఆశగా తోకాడించుకుంటూ, చొంగ కార్చుకుంటూ తారట్లాడుతూంది. ముష్టివాడు కర్రతోదాన్ని తోలుతున్నాడు, కర్రెత్తి కొట్టినప్పుడల్లా "కుయ్యో" మంటూ వెనక్కి వెడుతూ మరుక్షణం మళ్ళీ తోకాడించుకుంటూ దగ్గర చేరుతూంది. ముష్టివాడు ఆఖరికి ఓ ముద్ద దానికి పడేశాడు. తిన్న దెబ్బలన్నీ మరిచి మహా సంతోషంగా, ఆశగా ఆ ముష్టి అన్నం పరమాన్నంలా ఆప్యాయంగా తినసాగింది ఆకుక్క. దాని కళ్ళనిండా సంతోషం, కృతజ్ఞత, విశ్వాసం.

(1970 - 75 మధ్య)